భారీ వర్షం.. రహదారులు జలమయం


భారీ వర్షానికి కూలిన ఏఎంసీ ప్రహరీ


మొగల్తూరు నక్కావారిపాలెంలో రోడ్డుపై వర్షం నీరు


గొల్లగూడెంలో డ్రెయిన్ తవ్వి ముంపు నీటిని తరలిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో ఆదివారం రాత్రి అతి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకూ వర్షం కురుస్తూనే ఉంది. పట్టణంలో డ్రైనేజీలన్నీ జలమయమవ్వడంతో బస్టాండ్ సెంటర్, అచ్చుగట్లపాలెం, హౌసింగ్‌బోర్డు కాలనీ, బద్దావానిపేట, బ్రాడీపేట, బంగారువారి చెరువుగట్టు, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో రోడ్లన్నీ సోమవారం మురుగనీరుతో అధ్వానంగా ఉన్నాయి. వర్షం తగ్గిన తరువాత కొద్ది సేపటికి రోడ్లపై నీరు తగ్గడంతో రోడ్లన్నీ మురుగుతో దర్శనమిచ్చాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి ఈదురు గాలులకు స్థానిక అగ్రికల్చరల్ మార్కెట్ యార్డు తూర్పు ప్రహరీ 100 అడుగుల మేర కూలిపోయింది. ప్రహరీ పడిపోవడంతో గోడ పక్కనే ఉన్న డ్రైనేజీ నుంచి మురుగునీరు రోడ్లపై ప్రవహించింది. మార్కెటింగ్ యార్డు గోడౌన్ సముదాయంలోని తూర్పు వైపు గోడ శిథిలమవడంతో పూర్తిగా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

మొగల్తూరులో భారీ వర్షం

మొగల్తూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మూడు రోజులుగా వర్షాలు కురవడంతో పాటు ఈదురుగాలులు వీస్తున్నాయి. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు మొగల్తూరులో 38.4 మిల్లీమీటర్ల వర్షం కురవగా, ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 44.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో పలు పల్లపు ప్రాంతాలు, మసీదు వీధి, గాంధీ బజారు, పాతకాలువ, నక్కావారిపాలెం, పెద్ద గొల్లగూడెంలో వర్షం నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. సర్పంచ్ పడవల మేరీ ఆధ్వర్యంలో గ్రామంలో వర్షం నీరు నిలిచిపోయిన ప్రాంతాల్లో జేసీబీలతో గోతులు తవ్వించి నీటిని బయటకు పంపే ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు రాత్రి నుంచి కురిసిన భారీ వర్షాలకు, ఈదురు గాలులకు మామిడి కాయలు నేల రాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

అకాల వర్షంతో జాగ్రత్త వహించాలి

నరసాపురం రూరల్: మూడు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో ఈనిక దశకు వస్తున్న వరిచేల రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండాల్సిన సమయంలో ఒక్కసారిగి వాతావరణంలో మార్పు చోటు చేసుకుని అధికంగా వర్షాలు కురుస్తుండటంతో అటు మామిడి, వరి రైతులు కూడా పంటలకు తెగుళ్ల సోకే ప్రమాదం ఉందని వాపోతున్నారు. వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు అనిల్‌కుమారి మాట్లాడుతూ వర్షాలు తగ్గిన తర్వాత ప్రొఫికనజోల్ ఒక మి.లీ. మందును లీటరు నీటితో కలిపి సాయంత్రం వేళ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. పాలు పోసుకునే దశలో పంట నేలకొరిగి కణుపు వద్దకు విరిగితే వీలైనంత త్వరగా దుబ్బులను నిలబెట్టి కట్టాలన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఆమె రైతులతో మాట్లాడారు. నరసాపురం మండలంలో 8,983, యలమంచిలి మండలంలో 6,284, మొగల్తూరు మండలంలో 1,402 ఎకరాల్లో ఈ క్రాపు నమోదు పూర్తయిందని ఏడీఏ అనిల్‌కుమారి పేర్కొన్నారు.

క్లుప్తంగా

క్షీరారామలింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు


క్షీరారామలింగేశ్వరస్వామి

పాలకొల్లు సెంట్రల్: స్థానిక క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం, మాసశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారికి అభిషేకాలు చేయించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేయించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారికి లీలా కల్యాణం, ముత్యాల పూజ చేశారు. అనంతరం స్వామివారికి పంచహారతుల కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసరావు, ఈవో యాళ్ల సూర్యనారాయణ, ట్రస్ట్‌బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉపాధి పనులు


ములపర్రులో పంటబోదెలో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

పెనుగొండ: ఉపాధి పనులు రైతులకు అండగా నిలుస్తున్నాయని ములపర్రు సర్పంచ్ మద్రే రాజేశ్వరీ ప్రసాద్ అన్నారు. ములపర్రులో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పర్యవేక్షించారు. ప్రతి రోజూ 300 మంది కూలీలతో ఉపాధి పనులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పంట కాలువల్లో నీటి ప్రవాహం ఇబ్బంది లేకుండా పంట బోదెలు తవ్వకం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉపాధి కూలీలకు ఎక్కువ పనిదినాలు కల్పించే విధంగా పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ పితాని సత్యనారాయణ పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయంలో వాటర్ కూలర్ ఏర్పాటు


ముత్యాలమ్మ ఆలయంలో వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న కమిటీ సభ్యులు

మొగల్తూరు: మొగల్తూరు కుక్కలవారి వీధిలో చెట్టుకింద కొలువైన ముత్యాలమ్మ ఆలయానికి అమెరికాలో ఉంటున్న ప్రవాసాంధ్రుడు మధిర సుబ్రహ్మణ్యం ఆర్థిక సహాయంతో వాటర్ కూలర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నిర్వాహకులు ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కుక్కల సత్యనారాయణ, కుక్కల నాగమల్లేశ్వరరావు, కుమార్ స్వామి, కడలి ఏడుకొండలు, మందులు, దొంగ సింహాచలం, లక్ష్మణ్, కుక్కల ఉమాశంకర్, రాజేష్ పాల్గొన్నారు.

పార్వతీ సమేత శివదేవ స్వామికి అభిషేకాలు

పాలకొల్లు అర్బన్: వాయు త్రిలింగ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన శివదేవునిచిక్కాలలోని పార్వతీ సమేత శివదేవస్వామికి సోమవారం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పార్వతీ అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన చేశారు. ఆలయ ఆవరణలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. సంతాన ప్రాప్తి కోసం నవ దంపతులు ఆలయ ఆవరణలో అభిషేకం చేయించుకుని కొబ్బరి మొక్కలు నాటారు. ఈవో నామాల రంగరాజన్, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ సాధనాల లక్ష్మి, ట్రస్టీలు, అర్చకులు సేవలందించారు.

ఆచంటేశ్వరుని హుండీ లెక్కింపు


ఆచంటేశ్వర ఆలయ హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

పెనుగొండ: ప్రసిద్ధి గాంచిన ఆచంటేశ్వర స్వామి ఆలయ హుండీ లెక్కింపు సోమవారం నిర్వహించారు. మహా శివరాత్రి ఉత్సవాలు ముగియడంతో హుండీకి రూ.4,72,343 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రామచంద్రకుమార్ తెలిపారు. భీమవరం ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ వి వెంకటేశ్వరరావు హుండీ లెక్కింపును పర్యవేక్షించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు, నాగ జ్యోతి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలి


పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న దళిత ప్రజాప్రతినిధులు

పెనుమంట్ర: టీడీపీ నాయకులు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించాలని లేకుంటే రాబోయే ఎన్నికలలో ప్రతిపక్ష హోదా కూడా వారికి దక్కదని వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. దళిత ప్రజాప్రతినిధుల మధ్య చిచ్చు పెట్టేందుకు చంద్రబాబునాయుడు ప్రయత్నిస్తున్నట్లు పెనుమంట్ర మండల వైఎస్సార్ సీపీ దళిత ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం అసెంబ్లీలో జరిగిన దాడి సంఘటనను వారు ఖండించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ అసెంబ్లీలో వైఎస్సార్ సీపీ దళిత ఎమ్మెల్యేపై టీడీపీ దళిత ఎమ్మెల్యేలను రెచ్చగొట్టి దాడి చేయించడాన్ని తీవ్రంగా ఖండించారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డి దళితులను ఉన్నత స్థానంలో కూర్చోబెట్టడాన్ని చంద్రబాబు జీర్ణించుకోలేకపోతున్నారని ఆరోపించారు. అసెంబ్లీలో హోం మంత్రితో పాటు ఐదుగురు దళితులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మంత్రి పదవులను కేటాయించారన్నారు. శాసన మండలి చైర్మన్‌గా దళిత నేతను నియమించారని గుర్తు చేశారు. అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణ పేద కుటుంబాలను ఆదుకుంటున్నారన్నారు. రాబోవు ఎన్నికలలో వైఎస్సార్ సీపీ 175 సీట్లను గెలుచుకుని జగన్‌మోహన్‌రెడ్డి తిరిగి సీఎం అవ్వడం ఖాయమని, చంద్రబాబు ప్రతిపక్ష హోదాలో అసెంబ్లీలో కూర్చునే అర్హతను కోల్పోయే పరిస్థితులు రాబోతున్నాయని అన్నారు. ఇప్పటికైనా టీడీపీ సభ్యులు అసెంబ్లీలో హుందాగా వ్యవహరించి తమ గౌరవాన్ని నిలుపుకోవాలని హితవు పలికారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు, ఓడూరు సర్పంచ్ బుర్రా రవికుమార్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఈది అనిత, మార్టేరు సర్పంచ్ మట్టాకుమారి, పెనుమంట్ర సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, ఆలమూరు, సత్యవరం ఎంపీటీసీ సభ్యులు పలివెల ఆశాలత, గెద్దం ఈశ్వరుడు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు ఈది ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ఆదేశాలతోనే భౌతిక దాడులు

పోడూరు: టీడీపీ అధినేత చంద్రబాబు ఆదేశాలతోనే అసెంబ్లీ సమావేశాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దళిత ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై టీడీపీ ఎమ్మెల్యేలు భౌతిక దాడులకు, వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ ఆచంట నియోజకవర్గ అధ్యక్షుడు, ఏపీ సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుమూడి రామచంద్రరావు ఆరోపించారు. అసెంబ్లీలో టీడీపీ ఎమ్మెల్యేల దౌర్జన్యాన్ని సోమవారం ఆయన తీవ్రంగా ఖండించారు. స్పీకర్ తమ్మినేని సీతారాం, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే సుధాకర్‌బాబుపై అమానుషంగా వ్యవహరించిన టీడీపీ ఎమ్మెల్యేలను చట్టసభల్లోకి అడుగుపెట్టకుండా నిషేధించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు కోరారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న పరిపాలనతో రాష్ట్రంలో దళితులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు ఎంతో అభివృద్ధి చెందుతున్నారని, ఆయా వర్గాల నుంచి సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక, అసెంబ్లీలో తమ ఉనికిని చాటుకోవడం కోసం టీడీపీ ఎమ్మెల్యేలు దౌర్జన్యకాండకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రామచంద్రరావు ప్రభుత్వాన్ని కోరారు.

23న గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష


ఏస్తేరు రాణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్

పెనుగొండ: ఆంధ్రప్రదేశ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 5వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రవేశానికి ఈ నెల 23న ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పెనుగొండ పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఏస్తేరు రాణి తెలిపారు. సోమవారం విలేకర్లతో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో 12 గురుకుల పాఠశాలలకు అయిదో తరగతిలో 960 సీట్లు, ఇంటర్మీడియట్‌లో 720 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈ నెల 23 లోపున పెద తాడేపల్లిలోని గురుకుల పాఠశాలలో, లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. విద్యార్థిని ఆధార్ కార్డు, తెల్లరేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫొటోతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పరీక్షకు వారం రోజులు ముందుగా వెబ్ సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చునన్నారు. ఉదయం 5వ తరగతి పరీక్ష, మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షా సమయానికి గంట ముందు కేంద్రానికి చేరుకొని హాల్ టికెట్, ఇతర ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేయించుకోవాలన్నారు. ఆసక్తి ఉన్నవారు సత్వరం దరఖాస్తు చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సైన్సుపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి


లంకలకోడేరు జెడ్పీ హైస్కూల్లో శ్యామ్ ప్రసాద్, డిప్యూటీ డీఈఓ శ్రీరామ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: విద్యార్థులు సైన్స్ పట్ల అవగాహన పెంచి శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని పెంపొందించాలని జిల్లా సైన్స్ అధికారి వీఎంజెడ్ శ్యామ్ ప్రసాద్ అన్నారు. అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్‌ల వర్కు షాప్ లంకలకోడేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సైన్స్ నమూనాలను పరిశీలించి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. డిప్యూటీ డీఈవో డి శ్రీరామ్ మాట్లాడుతూ విద్యార్థులకు స్వతహాగా ప్రాజెక్టులు రూపొందించే విధంగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులు రూపొందించిన సెన్సార్ రోబోలను పరిశీలించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్, శ్రీరామ్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం జీబీజె ప్రసాదరావు, అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్ వీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, జిల్లాలోని 12 అటల్ ల్యాబ్ ఇన్‌చార్జ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లు కళాపరిషత్ ఆహ్వానపత్రిక ఆవిష్కరణ


కళాపరిషత్ ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లు కళాపరిషత్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 7,8,9 తేదీల్లో నిర్వహించనున్న 14వ జాతీయస్థాయి నాటక పోటీల ఆహ్వాన పత్రికను కళాపరిషత్ సభ్యులు ఆవిష్కరించారు. సోమవారం ఓ అతిథి భవనంలో కళా పరిషత్ ఉపాధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.పి.ఎన్ వర్మ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. కళాపరిషత్ అధ్యక్షుడు కె.వి కృష్ణవర్మ మాట్లాడుతూ పట్టణంలో కళారంగానికి దాతల ప్రోత్సాహం అభినందనీయమని అన్నారు. కళాకారులు, కళాభిమానులు, కళా పోషకులు వచ్చే నెలలో నిర్వహించనున్న నాటక పోటీలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరిషత్ సభ్యుడు మేడికొండ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, జక్కంపూడి కుమార్, కొణిజేటి గుప్త, విశాకుల వెంకటరమణ, షేక్ పీర్‌సాహెబ్, సోమంచి శ్రీనివాసశాస్త్రి, కొల్లి కొండ ప్రసాద్, రెడ్డి వాసు పాల్గొన్నారు.

సామూహిక రమా సత్యనారాయణస్వామి వ్రతం

పాలకొల్లు అర్బన్: పూలపల్లిలో నూతనంగా పునః నిర్మించిన గంటాలమ్మ, దేవులమ్మ ఆలయ ఆవరణలో సోమవారం సామూహిక శ్రీరమా సత్యనారాయణ స్వామి వ్రతాలు ఘనంగా నిర్వహించారు. పట్టిసీమ వాస్తవ్యులు బ్రహ్మశ్రీ ర్యాలి శేఖరశర్మ, గుడ్లవల్లేటి వెంకటరత్నం, అవినాష్, ప్రశాంత్, శ్రీకాంత్ బ్రహ్మత్వంలో అమ్మవార్ల ఆలయ ట్రస్టీ దంపతులతో పాటు సుమారు 35 మంది దంపతులు పూజలో కూర్చుని వ్రత పూజలు నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, మండపారాధన, స్వామివారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన నిర్వహించారు.

పాఠశాలకు నీటిశుద్ధి యంత్రం బహూకరణ


జీవీఎస్‌వీఆర్ఎం పాఠశాలకు నీటి శుద్ధి యంత్రాన్ని అందిస్తున్న జేసీఐ సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలకు జేసీఐ పాలకొల్లు రైజింగ్ సభ్యులు నీటి శుద్ధి యంత్రం అందజేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన జేసీఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మీట్ అండ్ గ్రీట్, జోన్ ఆఫీసర్స్ బోర్డు సమావేశం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలో అయ్యప్పస్వామి ఆలయం వద్ద వెల్‌కమ్ బోర్డు, స్కూల్‌కు నీటి శుద్ధి యంత్రం, రైల్వేస్టేషన్లో ఆరు బెంచీలు, సరస్వతి శిశుమందిర్‌లో కంప్యూటర్ ల్యాబ్‌లో యూపీఎస్ పవర్ బ్యాక్ అప్ సిస్టం అందజేశారు. జేసీఐ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మతివణన్ మాట్లాడుతూ ఆరేళ్ల క్రితం జేసీఐ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్, పట్టణ జేసీఐ ప్రెసిడెంట్ డాక్టర్ కావలి మౌని, సెక్రటరీ గంటా అనూష, ట్రెజరర్ కారుమూరి సబిత, రేపాక మీనా మణిదీప్తి, డాక్టర్ సీహెచ్ శ్రీలలిత, రేపాక ప్రవీణ్‌భాను, కొమ్ముల మురళీకృష్ణ, మనోజ్ విష్ణు, మౌనిక పాల్గొన్నారు.

ప్రకృతిలో అంతరిస్తున్న దశలో పిచ్చుకలు


కళాశాలలో వరల్డ్ స్పారో డేలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి

పాలకొల్లు సెంట్రల్: గతంలో పిచ్చుకలు ఇళ్ల వద్ద, చెట్లపై, కరెంటు తీగలపై గూళ్లు కట్టుకుని కిలకిలలాడుతూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండేవని ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. సోమవారం స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వరల్డ్ స్పారో డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ నేడు మచ్చుకు కూడా పిచ్చుకలు కనిపించడం లేదన్నారు. ప్రకృతిలో పిచ్చుకలు అంతరిస్తున్న దశకు చేరుకోవడానికి ప్రధాన కారణం రసాయన ఎరువులు, సెల్‌టవర్ల వల్ల వచ్చే రేడియేషన్, అధిక కాలుష్యం కారణమని అన్నారు. రాబోయే తరాలకు పిచ్చుకలు బొమ్మల్లో చూపించే పరిస్థితి కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు యం రామకృష్ణ, పి జ్యోత్స్న, హెప్సిబా, వై విజయ్‌కుమార్, జి మహేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు


ఉన్నత పాఠశాలలో విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు సోమవారం ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎస్‌వీ మూర్తిరాజు, ఆసుపత్రి సిబ్బంది మేరీ పుష్పరాజ్యం, సావిత్రి, విరాజిత, దివ్యశ్రీ, ఆశ కార్యకర్తలు సత్యవతి, దుర్గ పాల్గొన్నారు.

ఉమావాసుకి రవిసోమేశ్వరస్వామికి విశేష పూజలు

పెనుమంట్ర: మాస శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం జుత్తిగలో ఉమావాసుకి రవి సోమేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వాసు శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలు చేసారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు



మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్యశాఖ సిబ్బంది

పెనుమంట్ర: మార్టేరు వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు సోమవారం రక్తపరీక్షలు నిర్వహించారు. నెగ్గిపూడి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించి హెమోగ్లోబిన్ శాతాన్ని రికార్డు చేశారు. విద్యార్థులకు, సిబ్బంది తగు సూచనలు, మందులను అందజేసారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్స్‌తో పాటు ఆరోగ్యశాఖ సిబ్బంది మాధవి, బి రామకృష్ణ, సంధ్య పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

ఆకివీడు: స్థానిక శాంతినగర్ శివారు ఖాళీ ప్రదేశంలో ప్రార్థన చేసుకుంటున్న తనపై దాడి చేశారని కైకలూరు మండలం సీతనపల్లికి చెందిన కట్టా జాన్ వెస్లీ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతానికి చెందిన కొందరు వ్యక్తులు తనను, తన భార్యను శాంతినగర్‌లోని గంధం ఉమా అనే అతని వద్దకు తీసుకువెళ్లగా రాడ్డుతోతనను కొట్టి దుర్భాషలాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు కె.రాజారెడ్డి తెలిపారు.

డ్రోన్ సర్వేతో భూ సమస్యల పరిష్కారం


పెనుమంట్రలో డ్రోన్ భూ సర్వేను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

పెనుమంట్ర: బ్రిటిష్ కాలంలో చేసిన భూసర్వే కారణంగా నేడు రైతులకు అనేక సమస్యలు తలెత్తుతున్నాయని వాటిని సరిచేసేందుకు ప్రభుత్వం వైఎస్సార్ జగనన్న సమగ్ర భూసర్వే ప్రారంభించిందని పెనుమంట్ర జెడ్పీటీసీ సభ్యురాలు కర్రి గౌరీసుభాషిణి అన్నారు. సోమవారం పెనుమంట్రలోని కామారెడ్డి రైస్‌మిల్లు గ్రౌండ్స్‌లో సమగ్ర భూ సర్వేను కొబ్బరికాయ కొట్టి డ్రోన్ సర్వేను ఆమె ప్రారంభించారు. ఈ సర్వే కారణంగా అనేక భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇది దేశంలోనే గొప్ప విషయమన్నారు. శాశ్వత భూహక్కు, భూరక్షణకు ఎంతగానో ఈ సర్వే దోహద పడుతుందన్నారు. తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ మాట్లాడుతూ తొలి విడతగా పెనుమంట్రలోని 3,763 ఎకరాల్లో పొలమూరులో 1,950 ఎకరాల్లో, జుత్తిగలో 1,880 ఎకరాలు, మల్లిపూడిలో 850 ఎకరాల్లో డ్రోన్ ద్వారా భూసర్వే చేసి రికార్డు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పెనుమంట్ర ఎంపీపీ కర్రి వెంకట నారాయణరెడ్డి, ఎంపీడీవో వి పూర్ణబాబ్జి, వైఎస్సార్‌సీపీ నాయకులు తేతలి సుధీర్‌రెడ్డి, కొవ్వూరి చిన్నారెడ్డి, సాయిరాజు, తాడి రాజారెడ్డి, వివిధ గ్రామాల వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కథా రచయిత మూర్తికి ఘన సత్కారం


బెంగుళూరులో పెనుగొండ ఎంఆర్‌వీని సత్కరిస్తున్న దృశ్యం

పెనుగొండ: శతాధిక కథా రచయిత, కవీ ఎమ్ఆర్‌వీ సత్యనారాయణ మూర్తిని బెంగుళూరుకు చెందిన కర్ణాటక తెలుగు రచయితల సమాఖ్య, జాతీయ ఉగాది పురస్కారంతో సత్కరించారు. ఎమ్ఆర్‌వీ సోమవారం పెనుగొండలో మాట్లాడుతూ ఆదివారం బెంగుళూరులోని ఇండో ఏసియన్ విద్యా సంస్థల సెమినార్ హాల్‌లో నిర్వహించిన సభలో సీబీఐ మాజీ డైరక్టరు జేడీ లక్ష్మీనారాయణ చేతుల మీదుగా సత్కారాన్ని, పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. పద మూడో రచన 'గోదావరి నవ్వింది'ని గ్రంథాన్ని ఆవిష్కరించారని తెలిపారు. బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ అధ్యక్షుడు కొలకలూరి ఆశాజ్యోతి, సంఘ కార్యదర్శి కేవీ శానీ జి చండీశ్వర్, ఏకాంబర నాయుడు, కే సంజీవి, ఆగ్రహారం నాగేషు, డాక్టర్ పి మమత, కవులు, రచయితలు పాల్గొన్నారని తెలిపారు.